## 'చీర లేకపోతే నాకు పండుగు వెళ్లదనుకున్నారా?'

# 'పుల్లంపేట జరీచీర'

[చిన్న కథ]

'మామిడిపిందె లంచుక్కున్నాయో... బాబోయ్! పద్దెనిమిది మూళ్ళపొడుగున్నట్టుంది... మాఅమ్మ యిలాంటిది ఒక్కటీ పెట్టలేక పోయింది...ఎన్నాళ్ళనుంచో మనసుపడుతున్నా నీ రంగుకోసం. పాపం, చెప్పినట్టు తెచ్చిపెట్టారు.'

రచయిత:

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

౧

యాజులు నెల్లూరిజిల్లాకోర్టులో గుమాస్తాగా వుండినప్పటి సంగతి.

ఇక నెలా పదిహేను రోజు లుందనగా, సంకురాత్రి పండుక్కి రాధమ్మని పుట్టింటివారు తీసుకువెళ్ళరని తేలిపోయింది.

అప్పటి కామె పద్దెనిమి దేళ్ళపిల్ల. పండుగు లనీ, పబ్బాలనీ, అచ్చట్లనీ ముచ్చట్లనీ కిందామీదా పడిపోతూ వుండేవయస్సు.

దగ్గిరగా వున్నంత కాలమూ పుట్టింటివా రామెకి లాంఛలాలన్నీ బాగానే తీర్చేవారు, కాని నెల్లూరికీ, పిఠాపురానికీ రానూ పోనూ కూతురికీ అల్లుడికీ కావలసిన రైలుఖర్చుల మొత్తం తెలిశాటప్పటికి వారికి గుండె లాగిపోయాయి.

ఇది ఆలోచించి చివరికి రాధమ్మ కూడా సరిపెట్టుకుంది.

మొదట మాత్రం తండ్రి రాసిన వుత్తరం చూసుకుని ఆమె నిర్ఘాంత పడిపోయింది.

ఇది యాజులు గుర్తించాడు. అతని హృదయం దడదడ కొట్టుకుంది; కాని వొక్క క్షణంలో తేరుకుని, ఆమె కళ్ళల్లోకి జాలిగా చూసి, తన వెచ్చని పెదవులతో తాకి ఆమె పెదవులకు చలనం కలిగించుకున్నాడు.

తరవాత "మడి కట్టుకోండి" అంటూ ఆమె వంటింటోకి వెళ్ళిపోయింది.

అతను తాపితా కట్టుకున్నాడు. కుచ్చెళ్లు పోసుకునేటప్పుడు "రెండేళ్ళకిందట విజయదశమినాడు నీ అత్తవారిచ్చారు నీ కిది. ఇంత గొప్పవి కాకపోయినా, ప్రతీసంవత్సరమూ నువ్వు నీ అత్తవారి బహుమతులు కట్టుకుంటూనే వున్నావు; కాని, పుట్టింటి వా రిస్తూనే వున్నారు గదా, లోటు లేదుగదా అనుకుంటున్నావే కాని రాధకి నువ్వొక్క చీర అయినా కొనిపెట్టావా, పాపం! చిలకవంటి పెళ్లానికి మొగుడు చూపించవలసిన మురిపం యిదేనా? చివరికి వొక్క రైక అయినా కుట్టించావా? నీ కిది బాగుం దనిపించిందా!" అని యెవరో నిలవతీసి అడిగినట్టనిపించింది.

దీంతో వల్లమాలిన సిగ్గువచ్చి వూదర గొట్టేసింది.

దానిమీద 'ఇప్పుడేనా రాధకొక మంచిచీర కొనియివ్వా' లనుకున్నాడు. 'ఇచ్చి తీరాలి. పండుక్కి కొత్తచీర లేని లోటు కలగనివ్వకూడదు' అనిదృఢపరుచుకున్నాడు.

కానీ, డబ్బేదీ?

ఏనెల జీతం ఆనెలకే చాలీ చా

లనట్టుంది. అక్కడికీ నెల్లూరిలో యింటి అద్దెలు చౌక కనక సరిపోయింది; కాని లేకపోతే యెన్ని చేబదుళ్లు చేస్తూ యెన్ని వొడిదుడుకులు పడవలసివచ్చేదో?

రాధమ్మ కూడా పొదుపయిన మనిషి కనక ఆటసాగుతోంది; కాని కాకపోతే, ఆ చేబదుళ్ళకు సాయం యెన్ని అరువులు పెరిగిపోయి వుండునో!

ఏమయినా చీర కొనితీరా లని శపథం పట్టుకున్నాడు.

ఖర్చులు తగ్గించుకోడం తప్ప మార్గాంతరం కనపడలేదు. ఆఖర్చులలో నేనా సంసారంకోసం రాధమ్మ చేసేవాటిలో తగ్గించడానికివీలు కనపడదు.

దీనిమీద 'నాఖర్చులు తగ్గించుకుంటా' నని అతను నిశ్చయించుకున్నాడు.

అది మొదలు అతను నాటకాలకి వెళ్ళడం కట్టిపెట్టేశాడు. పుస్తకాలు కొనడం మానేసి భాండాగారానికి వెళ్ళసాగాడు. ఒకటి రెండు వినోదయాత్రలు చాలించుకున్నాడు. కోర్టుకి వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ బండెక్కడం తగ్గించుకున్నాడు. మధ్యాహ్నం కోర్టుదగ్గిర ఫలహారం వొక్కటే కాదు, కాఫీ కూడా మానుకున్నాడు.

పొద్దుటి పూట మాత్రం యింటి దగ్గిర కాఫీసేవ మానుకోలేదు. అంచేత రాధమ్మ కిదేమీ తెలవకుండా జరిగిపోయింది.

## ౨

ఆవేళ పెద్దపండుగు.

మధ్యాహ్నం రెండుగంటల సమయంలో, యాజులు, రాధమ్మ యేం చేస్తోందో చూదా మని వసారాలోకి వెళ్ళి జంటవెదురుకుర్చీలో కూచున్నాడు. ఉన్నచీరల్లో మంచివి నాలుగు పట్టుకు వచ్చి 'వీటిలో యేది కట్టుకోను చెప్పండీ' అంటూ రాధమ్మ పక్కని కూచుంది.

'నన్నడగడం యెందుకూ?'

'మంచిచీర కట్టుకోడం మీకోసమా, నాకోసమా?'

'నాకోసమే. అయితే, ఆచీరలన్నీ మీవాళ్ళిచ్చినవి. వాటిమీద నాకేమీ అధికారం లేదు'

'అదేమిటండీ?'

'ఎకసక్కెం చెయ్యడం లేదు నేను'

'చె—ప్పండీ పెడర్థాలు తియ్యకా'

ఇలా గునుస్తూ ఆమె కుడిచెయ్యి అతని నడుముకి చుట్టేసింది.

దానిమీది, ఆనందమూ, వుద్వేగమూ అతికష్టంమీద అణుచుకుంటూ అతను 'నేను మానెయ్యమన్నది మానేసి కట్టుకో మన్నది కట్టుకుంటావా?' అని గంభీరంగా ప్రశ్నించాడు.

'ఆ'

'అయితే అవన్నీ పెట్టిలో పెట్టేసి రా'

ఆమె కేమీ అర్థం కాలేదు. అయినా, యేదో లేకుండా అతనలా చెప్ప డని యెరుగును కనక, అతనికి అడ్డుమాట చెప్ప లేదు కూడా కనుక, వొక్కమాటు గంభీరంగా చూసి అవి యింటో పెట్టేసి వచ్చి, మళ్ళీ పక్కని కూచుని 'మరి చెప్పండి' అని అడిగింది.

వెంటనే అత నొక్కమాటు మందహాసం మొలిపించి, అతి తాపీగా లేచి, అతిదర్జాగా వాకిట్లోకి వెళ్ళి, మేజాసొరుగులో నుంచి వొక పొట్టం తీసుకు వచ్చి అతిప్రేమతో ఆమె కందించి దగ్గిరగా కూచున్నాడు.

ఆమె చేతులు గబగబ లాడిపోయాయి.

విప్పి చూడగా, అల్లనేరేడుపండు చాయలో నిగనిగ మెరిసి పోతూ వుల్లంపేట జరీచీర.

'ఇదెలా వచ్చిం దండీ?' అని అడుగుతూ ఆమె మడత విప్పింది; వెంటనే మైజారు కొంగున వున్న జరీ నిగనిగ, ఆమె కళ్ళల్లోనూ, చెక్కిళ్ళమీదా, పెదవులమీదా తళుక్కు మంది.

దాంతో అతని మొగం మరీ గంభీరముద్ర వహించింది.

'చెప్పండీ'

'వెళ్ళి కట్టుకు రా'

'మానేస్తానా యేమిటి చె—ప్పండీ'

'చెప్పనా యేమిటి కట్టుకురా'

ఆమె గదిలోకి వెళ్ళి మడత

పూర్తిగా విప్పగా యేదో కింద పడింది.

'ఇందులో పట్టు జాకెట్టుకూడా వుందండీ'

'ఇంకేం, తొడుక్కు రా'

యాజులు ఎక్కడ మాట్లాడకుండానే కూచున్నాడు కాని 'మామిడిపిందె లించుక్కున్నారో!' 'బాబోయ్! పద్దెనిమిది మూళ్ళ పొడుగున్నట్టుంది' 'మా అమ్మ యిలాంటిది వొక్కటీ పెట్టలేకపోయింది' 'ఎన్నాళ్ళనుంచో మనసుపడుతున్నా నీరంగుకోసం. పాపం, చెప్పినట్టు తెచ్చిపెట్టారు' అంటూ అక్కడ రాధమ్మ రిమార్కులమీద రిమార్కులు దొర్లించేసింది.

అది విని తన కష్టం పూర్తిగా ఫలించినందు కతను చాలా సంతోషించాడు.

తరవాత ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వచ్చి వొళ్ళో కూచుని ఆమె 'యిదెలా వచ్చింది చెప్పరూ?' అని మళ్ళీ అడిగింది.

'పుల్లంపేటలో వొక దేవాంగి నేశాడు'

'ఊహూ'

'అది తెప్పించి నాతా సుదర్శన శెట్టి నెల్లూరి పెద్దబజారులో పెట్టి అమ్మాడు'

'సరే'

'నేను కొన్నాను'

'బాగుంది'

'నువ్వు కట్టుకున్నావు'

'ఎలా వచ్చిందీ?'

'మళ్ళీ మొదలా?'

'మరి నా ప్రశ్న అలాగే వుండిపోయింది కదూ?'

'లేదు, బాగా ఆలోచించుకో'

'పోనీ, యిది చెప్పండి. డబ్బెక్కడిదీ?'

'మన యింటోదే'

'నాకు తెలవకుండా యెలా వచ్చిందీ?'

'మిగిలిస్తే వచ్చింది'

'ఎవరూ?'

'నేను'

'ఎలా మిగిల్చారూ?'

అతను రెప్పవెయ్యకుండా చూశాడు.

'చెప్పరు కాదూ? అయితే నన్ను—'

'ఆగు ఆగు. ఇవాళ పెద్ద పండుగు. అలాంటిమాటలు రాకూడదు'

'అయితే, మరి చెప్పండి'

యాజులు జరిగిందంతా చెప్పాడు; కాని, నమ్మలేక, ఆమె, 'నిజంగా?' అంటూ చెయ్యి చాపింది.

'అక్షరాలా నిజం. ముమ్మాటికీ నిజం' అంటూ అతనాచేతిలో చెయ్యి వేసి, ఆచెయ్యి గిల్లాడు.

ఆమె మనస్సు గుబగుబ లాడిపోయింది. హృదయం నీరయిపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

'చూశారా? నా చీరకోసం కాలెండలో నడిచివెళ్ళారా? అక్కడ కడుపు మాడ్చుకుని వుసూరుమంటూ పని చేశారా? చీర లేకపోతే నాకు పండుగు వెళ్ళదనుకున్నారా? నేను రాకాసినా?' అని యిక మాట్లాడలేక చేతులు అతని కంఠానికి పెనవేసి తన శిరస్సు అతని భుజం మీద ఆనుకుని దుఃఖించసాగింది.

అది చూసి మొదట అతను నిర్విణ్ణు డయిపోయాడు; కాని తరవాత 'ఛా! ఏడుస్తావా? నేను ఏది వద్దనుకున్నానో అదే చేస్తావా? ఇలా చూడూ. అబ్బే! అయితే నాకూ నీకూ మాట ల్లేవు. నాకూ నీకూ జతలేదు' అని బెదిరిస్తూ మూతి బిగాయించుకుని ఆమె మొగం పైకెత్తి కొంటె చూపులు చూశాడు.

ఏడ్పల్లా ఆమెకి నవ్వాయిపోయింది.

'మరి నాతో యెందుకు చెప్పారు కారూ? నేనుమాత్రం కాఫీ మానుకోకపోదునా? దాంతో మీకూడా జామారు రాకపోవునా?'

'ఇప్పుడు రాకపోతేనా?'

'ఏదీ, చూపించరూ?'

ఇద్దరూ లేచారు. ఒకర్ని వొకరు పొదివి పట్టుకుని వాకిట్లో మేజా దగ్గిరికి వెళ్లారు. యాజులు సొరుగు లాగి వెంకటగిరి సరిగంచు చాపు పైకి తీశాడు.

అది చూసి, ఆమె సంతోషవిహ్వల అయి 'మరి తొరగా కట్టేసుకోండి' అంటూ అతని భుజాలు వూపేసింది.